క్లుప్తంగా

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న నిర్మల

పాల్వంచరూరల్: ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి బైరి నిర్మల కోరారు. స్థానిక టీచర్స్ కాలనీలో బుధవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ బూత్‌లలో అధ్యక్షులను, శక్తి కేంద్ర ఇన్‌చార్జులను, పన్నా ప్రముఖ్‌లను నియమించి బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేసి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాండ్ర వినోద్‌రావును గెలిపించాలని కోరారు. ఈ అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు రాపాక రమేష్, గంగపూరి దుర్గాప్రసాద్, కటికల రంజిత్, భీమాల్ జైన్, కల్యాణ్, నవీన్, వంశీ సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మోటార్ ఏర్పాటు



మోటార్‌ను ప్రారంభిస్తున్న క్లబ్ ప్రతినిధులు

పాల్వంచ: పట్టణంలోని వికలాంగుల కాలనీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంచినీటి అవసరాలు తీర్చేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ గోల్డ్ ఆధ్వర్యంలో మోటార్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.16వేల ఖర్చుతో ఏర్పాటు చేసిన 1హెచ్‌పీ మోటార్‌ను ప్రారంభించారు. క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ ఆరుద్ర సత్యనారాయణ మాట్లాడుతూ.. పాఠశాలలో 280 మంది విద్యార్థులున్నారని వారి సౌకర్యార్థం మోటార్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పుట్టా నాగేశ్వరరావు, కాట నవీన్, పోట్రు సతీశ్, బ్రహ్మచారి పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

పాల్వంచరూరల్: ప్రభుత్వ అసైన్డ్ భూమి ఆక్రమణకు గురవుతోందని విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు బుధవారం తహసీల్దార్ వివేక్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 999లో 70 ఎకరాల భూమిని మాజీ ఎమ్మెల్యే కుమారులు కబ్జా చేశారని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వ భూమిని కాపాడాలని, అక్రమ పద్ధతిలో భూమిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎండీకి వినతి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం గతేడాది వెల్ఫేర్ ఆఫీసర్ (ట్రైనీ) ఇంటర్నల్ నోటిఫికేషన్ ఆధారంగా నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు న్యాయం చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కి మంగళవారం రాత్రి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కంపెనీలో ఖాళీగా ఉన్న 11 పోస్టులకు ఇంటర్నల్ అభ్యర్థుల ద్వారా భర్తీ చేయాలన్నారు. మే 2023లో పరీక్ష నిర్వహించిదని, 435 మంది క్వాలీఫై అయ్యారని, వీరిలో మెరిట్‌ను బట్టి ఆరుగురికి పదోన్నతులు కల్పించినట్లు పేర్కొన్నారు. మిగతా వారికి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన సీఎండీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

చర్యలు తీసుకోండి..

కొత్తగూడెంరూరల్: రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయని, ప్రజా రక్షణ చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ రాష్ట్ర వ్యవస్థాపకుడు మద్దెల శివకుమార్ కోరారు. బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయని, 40 డిగ్రీలు దాటుతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్లపై నీళ్లు చల్లడంతోపాటు, వైద్యశాఖ అధికారులు సమ్మర్ అలర్ట్ ప్రకటించాలన్నారు. పట్టణంలోని కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్ పంపిణీ చేయాలని సూచించారు. ఈసారి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించినా అధికారులు ఇంకా ఎటువంటి చర్యలు ప్రారంభించలేదన్నారు.

వ్యక్తి మృతి

పాల్వంచరూరల్: ప్రమాదవశాత్తు డ్రెయినేజీ కాలువలో పడి పాల్వంచ పట్టణంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ.రాము తెలిపిన వివరాలు... స్థానిక పట్టణంలోని ఒడ్డుగూడెంకు చెందిన కార్పెంటర్‌గా పని చేస్తున్న జి.గోపికృష్ణ (36) బుధవారం అల్లూరు సెంటర్‌లో డ్రెయినేజీలో పడి మృతి చెందాడు. అయితే మద్యం మత్తులో కాలువలో పడి మృతి చెంది ఉంటాడని స్థానికులు అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రిలో ఉంచినట్లు తెలిపారు.

నిరుపయోగంగా చెక్ డ్యాంలు..

- రూ.2.40 కోట్ల ప్రజాధనం వృథా
- కరివారిగూడెం, కోయగూడెం రైతుల ఆవేదన
- పట్టించుకోని అధికారులు



ఇసుకతో నిండిన కరివారిగూడెం వద్ద చెక్ డ్యాం

జూలూరుపాడు: కరివారిగూడెం గ్రామ సమీపంలోని పెద్దవాగుపై నిర్మించిన చెక్ డ్యాం నిరుపయోగంగా మారింది. వరద ప్రవాహానికి కొట్టుకొచ్చిన ఇసుక మేట వేయడంతో సైడ్ వాల్స్ తప్ప చెక్ డ్యాం నామరూపాలు కనిపించడం లేదు. దీంతో చెక్ డ్యాంలో వరదనీరు నిలవకపోవడంతో సుమారు 50 ఎకరాల సాగు భూమికి నీరు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోయింది. చెక్ డ్యాం నిర్మాణంతో సాగు భూములకు నీరు అందుతుందని ఆశపడ్డ రైతులకు నిరాశే మిగిలింది. 2020–2021లో నాబార్డు సంస్థ నిధులు రూ.1.20 కోట్ల చొప్పున కరివారిగూడెం గ్రామ సమీపంలోను, బేతాళపాడు గ్రామ పంచాయతీ రాచబండ్ల కోయగూడెం గ్రామ సమీపంలో పెద్దవాగుపై రెండు చెక్ డ్యాంలను మొత్తం రూ.2.40 కోట్లతో ఇరిగేషన్‌శాఖ ఇంజనీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో నిర్మించారు. వాగులు, వంకలు, ఎత్తైన ప్రదేశాల నుంచి ప్రవహించే వరద నీటిని నిల్వ చేసి సాగు భూములకు నీటి సౌకర్యం కల్పించడంతోపాటు, పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెంచేందుకు చెక్ డ్యాంలను ప్రభుత్వం నిర్మిస్తోంది. రెండు చెక్ డ్యాంల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ ద్వారా దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నిర్మించి చేతులు దులుపుకున్నారు. కరివారిగూడెం గ్రామ సమీపంలో పెద్దవాగుపై చెక్ డ్యాంను ఇరిగేషన్‌శాఖ ఇంజనీరింగ్ అధికారులు ముందు చూపు లేకుండా నిర్మించారు. సుజాతనగర్ మండలం సింగభూపాలెం చెరువు శిఖంలోనే పెద్దవాగుపై చెక్ డ్యాంను నిర్మించే విధంగా ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు డిజైన్ చేయడంతో నిరుపయోగంగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో చెరువు శిఖంలో చెక్ డ్యాంను తక్కువ ఎత్తులో నిర్మించడంతో ఇసుకతో మునిగిపోవడంతో చుక్క నీరు నిలిచే అవకాశం లేకపోవడంతో వరద నీరంతా చెరువులో కలిసిపోతుందని, అదేవిధంగా వాగు ఇరువైపుల పటిష్టమైన మట్టి కట్ట నిర్మించలేదని రైతులు చెబుతున్నారు. చెక్ డ్యాం నిర్మాణంతో వానాకాలం, వేసవికాలంలోనూ వరిపంట సాగు అవుతుందని భావించామని, తీరా చూస్తే నీరు నిలవడం లేదంటున్నారు. పరిసరాల్లోని వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయని, వేసవికాలంలో పశువుల దాహార్తి తీరుతుందని ఆశపడితే నిరాశే మిగిలిందని వపోతున్నారు. చెక్ డ్యాంను సర్వే చేసిన ప్రాంతంలో కాకుండా కాంట్రాక్టర్ చెరువు శిఖంలో నిర్మించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దవాగు వరద ప్రవాహం, నీటి నిల్వ సామర్థ్యం, సాగు ఆయకట్టు అంచనా వేయకుండా ఇరిగేషన్ అధికారులు నిర్మించారని రైతులు విమర్శిస్తున్నారు. మిషన్ కాకతీయ పథకం కింద సింగభూపాలెం చెరువు ఆనకట్ట, అలుగు ఎత్తు పెంచడంతో మండలంలోని కరివారిగూడెం, చింతలతండా, లయన్ తండా, కొమ్ముగూడెం గ్రామాలకు చెందిన సాగు భూములు వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నట్లు రైతులు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చెక్ డ్యాం ఆనకట్టను ఎత్తు పెంచడంతోపాటు, వాగు ఇరువైపుల మట్టి కట్టను పటిష్టపరిచి సాగు భూములకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా రాచబండ్లకోయగూడెం గ్రామ సమీపంలో పెద్దవాగుపై నిర్మించిన చెక్ డ్యాం కూడా సాగు భూములకు నీరు అందడం లేదు. ప్రజాధనాన్ని దుర్వినియోగానికి పాల్పడిన ఇరిగేషన్‌శాఖ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌పై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు అందడం లేదు...



చెక్ డ్యాం నిర్మాణంతో ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందడం లేదు. తక్కువ ఎత్తులో నిర్మించడంతో ఇసుక మేట వేసి చెక్ డ్యాం కనిపించకుండా పోయింది. పెద్దవాగు కింద ఐదు ఎకరాల సాగు భూమి ఉంది. చెక్ డ్యాం నిర్మిస్తే వరి పంట సాగు చేసుకోవచ్చని ఆశపడ్డాం. కానీ నిరాశే మిగిలింది.

– వడ్డె శ్రీనివాసరావు, రైతు కరివారిగూడెం

అధికారుల నిర్లక్ష్యమే కారణం



అధికారుల నిర్లక్ష్యం కారణంగానే చెక్ డ్యాం ఉపయోగం లేకుండా పోయింది. చెక్ డ్యాం సింగభూపాలెం చెరువు శిఖంలో నిర్మించడంతో ఇసుక మేట వేయడంతో నీరు నిలవడం లేదు. రూ.లక్షలతో నిర్మించినా ఉపయోగపడకుండా పోతోంది. వ్యవసాయ బోర్లే ఆధారం తప్ప మారో మార్గం లేదు.

– అంగోత్ జానకిరామయ్య, రైతు కరివారిగూడెం

అడ్డగోలుగా కట్టారు



చెక్ డ్యాం సాగు భూములకు ఉపయోగపడకుండా అడ్డగోలుగా కట్టారు. చెక్ డ్యాంను తక్కువ ఎత్తులో నిర్మాంచారు. వాగుకు ఇరువైపుల మట్టి కట్ట పటిష్టంగా నిర్మించలేదు. వాగు అవతల రెండున్నర ఎకరాల సాగు భూమి ఉండటంతో వర్షాకాంలో దాటలేం. వేసవికాలంలో మాత్రమే వరి పంట సాగు చేస్తాం. – ఈర్ల రమేష్, రైతు కరివారిగూడెం

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



భూమిపూజలో పాల్గొన్న దంపతులు

జూలూరుపాడు: భోజ్యాతండా గ్రామ పంచాయతీ పుల్లుడు తండాలో బుధవారం శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. స్థలదాత బానోత్ రాములు నాయక్ కుమారుడు కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ బానోత్ నవీన్ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి దంపతులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు ఎస్సై జీవన్‌రాజు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్యా సోనీ, మాలోత్ మంగీలాల్ నాయక్, బానోత్ వెంకట్రామ్, నున్నా కృష్ణయ్య, బానోత్ హనుమాన్, ధర్మరాజుల వెంకటనారాయణ, అరిగెల నరసింహారావు, వాంకుడోత్ కిషన్ నాయక్, మాళోత్ మహేష్, రావుట్ల నరేష్, యాసా నరేష్, యాసా రోశయ్య హాజరయ్యారు.

నిత్యావసరాల వితరణ

జూలూరుపాడు: భోజ్యాతండా గ్రామ పంచాయతీ పుల్లుడు తండాకు చెందిన లావుడ్యా శాంతి ఇటీవల ఓ ప్రమాదంలో వెన్నుపూస దెబ్బతినడంతో మంచానికే పరిమితమైంది. జేపీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఆమెకు ఎస్సై జీవన్‌రాజు చేతుల మీదుగా నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకుడు ఇడుపుల రాజు, అరిగెల నరసింహారావు, బానోత్ నవీన్, ఆర్.నరేష్, ఉపాధ్యాయుడు అనిల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా కృష్ణ



నియామకపత్రం అందుకుంటున్న కృష్ణ

ఇల్లెందు: కాంగ్రెస్ పార్టీ మండల సేవాదళ్ అధ్యక్షుడిగా ఇల్లెందు పట్టణానికి చెందిన గొరిశెట్టి కృష్ణను నియమించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. కృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రజలకు అందేలా కృషి చేస్తానన్నారు. త్వరలో సేవాదళ్‌ను బలోపేతం చేస్తామని ప్రభుత్వం పథకాల ప్రచారంలో ముందు ఉంటామని తెలిపారు.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ నిర్మలాజ్యోతి

జూలూరుపాడు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ సీహెచ్ నిర్మలాజ్యోతి అన్నారు. బుధవారం మాచినేనిపేటతండా గ్రామ పంచాయతీ హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రంలో కొమ్ముగూడెం సెక్టార్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించడంతోపాటు, అంగన్‌వాడీ కేంద్రాలను సమయానికి తెరవాలన్నారు. రికార్డులు, రిజిష్టర్లు అప్‌డేట్‌గా ఉండాలని సూచించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని చెప్పారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు లలిత, వరలక్ష్మి, సుమిత్ర, స్రవంతి, రామరాజ్యం, సునీత, శారద, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పనివేళలు మార్చండి..

ఇల్లెందు: మండుటెండలు కార్మికులకు ఇబ్బందిగా ఉంది. వేసవి వేడి నుంచి కార్మికులను కాపాడాల్సిన బాధ్యత అధికారులు, పాలకుల మీద ఉంది. వడదెబ్బ తగిలి అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. ఏటా కార్మికుల పనివేళలను మార్చి అనుకూలమైన వేళలు కేటాయిస్తున్న అధికారులు ఈసారి పనివేళలను మార్చాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. బుధవారం మున్సిపల్ కమిషనర్ యాదగిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు యాకుబ్‌షావలీ, పాయం వెంకన్న మాట్లాడుతూ... కార్మికులను కాపాడుకునేందుకు వచ్చే మూడు నెలలు పని వేళలు మార్చాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు కృష్ణ, వెంకన్న, వేణు, ఉమ, దుర్గ, అరుణ, వరలక్ష్మి, రామచంద్రయ్య, కృష్ణవేణి, అనిల్ ఉన్నారు.

కలెక్టరేట్‌లో పార్కింగ్ ఇక్కట్లు





కలెక్టర్ కార్యాలయంలో ఎండలో పార్క్ చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలు

నవభారత్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) కార్యాలయంలో ఉద్యోగులతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజల వాహనాలను ఎండలోనే పార్కింగ్ చేయవలసిన పరిస్థితి. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 23 మండలాలకు చెందిన ప్రజలు, కలెక్టర్, అదనపు కలెక్టర్‌లతో పాటు ఇతర ఉన్నతాధికారులను కలిసేందుకు, వారి సమస్యలు పరిష్కరించుకునేందుకు కలెక్టర్ కార్యాలయానికి ద్విచక్ర వాహనాలు, కార్లలో వస్తుంటారు. వీరంతా ఎండలోనే పార్కింగ్ చేయవలసి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. భారీ ఖర్చుతో నిర్మాణం చేసిన కలెక్టరేట్‌లో అధికారులతో పాటు సందర్శకుల వాహనాలలోని పెట్రోల్ ట్యాంక్‌లు పేలి ప్రమాదాలు సంభవించే అవకాశాలు లేకపోలేదు. పక్కనే ఉన్న ఖమ్మం కలెక్టరేట్‌లో వాహనాలకు ఇబ్బంది లేకుండా సోలార్ షెడ్లను ఏర్పాటు చేసి వాహనాలన్నీ నీడపట్టున ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కలెక్టరేట్ కార్యాలయంలో పార్కింగ్‌కు షెడ్లను ఏర్పాటు చేయాలని వాహనదారులు, సందర్శకులు కోరుతున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం)/కొత్తగూడెంరూరల్: ఐదు దశాబ్దాలుగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అందించిన సేవల ఫలితంగానే తనను మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని చాతకొండ హమాలీ కాలనీ గ్రామ పరిధిలో బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడికి ప్రజాధారణ ఉంటుందని అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయని, అహంకారంతో వీర్రవీగే నాయకులు ఇంటికే పరిమితం అవుతారన్నారు. పేదప్రజలు కార్మికులు, కర్షకుల కోసమే పుట్టిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, అధికారం ఉన్నా లేకున్నా.. యావత్ కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షమే వహిస్తుందని తెలిపారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిత్యం శ్రమిస్తానని, నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు అధికార పార్టీపైన పోరాడేందుకు వెనుకాడనన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో మునుపెన్నడూ లేనివిధంగా వంద రోజుల్లోనే రూ.5 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలు కూనంనేని, ఎస్‌కే సాబీర్‌పాషాను ఘనంగా సన్మానించారు. ఎలుక రామారావు, కే.సారయ్య, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, భుక్యా శ్రీనివాస్, బంధం నాగయ్య, బాతుల సురేష్, పల్నాటి ప్రశాంత్, గుత్తుల శ్రీనివాస్, మిర్యాల రాము, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఇల్లెందు: తెలంగాణ రాష్ట్ర బార్ అసోసియేషన్ ఎన్నికల సంఘం ఆదేశానుసారం ఈ నెల 28న ఇల్లెందు బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలని నోటిఫికేషన్ జారీ అయింది. ఇల్లెందు బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి త్రిముఖ పోటీ నెలకొంది. ఏడాది కాలం పదవిలో ఉండే అధ్యక్ష స్థానానికి ముక్కోణపు పోటీ ఉండగా 51 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అధ్యక్ష రేసులో పెద్దరి వెంకటనర్సయ్య, పసుపులేటి యాకయ్య, భూక్యా రవికుమార్ నాయక్ తలపడుతున్నారు. గురువారం జరగనున్న ఎన్నికలకు ఎన్నికల అధికారి మామిడి సత్యప్రకాష్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం కార్యవర్గానికి జరిగిన ఎన్నికలో ప్రధాన కార్యదర్శిగా కె.ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా కీర్తికార్తీక్, కోశాధికారిగా చినుముల నవీన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక కార్యవర్గ సభ్యులు, ఒక ఉపాధ్యక్ష స్థానం పెండింగ్‌లో ఉంది.

పారిశుద్ధ్యం, నర్సరీల నిర్వహణ పరిశీలన



తోగ్గూడెంలో నర్సరీని పరిశీలిస్తున్న సుధీర్

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని జిల్లా పంచాయతీ అధికారి సుధీర్ ఆదేశించారు. మండలంలోని తోగ్గూడెం గ్రామాన్ని బుధవారం జిల్లా పంచాయతీ అధికారి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. పంచాయతీ నుంచి పౌరులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతీరోజు గ్రామాల్లో పారిశుద్ధ్య సేవలను నిర్వహించాలని, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎండలకు నర్సరీల్లో మొక్కలు చనిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. డీపీఓ వెంట ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, ఎంపీఓ బి.నారాయణ, ఎంపీఓ రంగా, గ్రామకార్యదర్శి రవి పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న కృష్ణ

ఇల్లెందురూరల్: యువత ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు చింత నర్సింహారావు, ఎన్డీ నేతలు మోకాళ్ల కృష్ణ, పోడుగు నర్సింహారావు పిలుపునిచ్చారు. కొమరారం గ్రామంలో పీవైఎల్, పీడీఎస్‌యూ నిర్మాణ జనరల్ బాడీ బుధవారం నిర్వహించారు. మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ విద్యాసంస్థలో సరిపడా ఉపాధ్యాయుల నియామకం చేపట్టకుండా, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించకుండా ప్రాథమిక విద్య ఎలా బలోపేతం అవుతుందని ప్రశ్నించారు. ఇక ఉన్నత విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలలో నెలకొన్న సమస్యలపై పీవైఎల్, పీడీఎస్‌యూ ఏటా ఉద్యమిస్తోందని గుర్తు చేశారు. భవిష్యత్‌లో బలమైన ఉద్యమాలు నిర్మించి పాలకుల కళ్లు తెరిపించి యువతకు విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేలా, శాస్త్రీయ విద్యా విధానం అమలు చేసేలా పోరాడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బానోత్ సంతు, చింత ఉదయ్, మోతీలాల్, మూడు మాలు, జోగ కృష్ణ, కోటన్న తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



జూలూరుపాడు: వాహనాలను తనిఖీ చేస్తున్న వైరా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రమణ

జూలూరుపాడు: వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. బుధవారం పోలీస్ చెక్ పోస్ట్‌ను వైరా నియోజకవర్గ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రమణ ఆకస్మికంగా సందర్శించి, జూలూరుపాడు ఎస్సై జీవన్‌రాజుతో కలిసి వాహనాల తనిఖీ చేశారు. రమణ మాట్లాడుతూ.. ఎన్నికల దృష్ట్యా డబ్బు, మద్యం రవాణాను అరికట్టేందుకు విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టాలని పోలీసులకు సూచించారు. ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

టేకులపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు టేకులపల్లి మండలం కారుకొండ క్రాస్‌రోడ్ వద్ద చెక్ పోస్టుని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం రవాణా చేయడాన్ని నివారించేందుకు చెక్‌పోస్టులో నియమితులైన అధికార సిబ్బంది ప్రతీరోజు వాహన తనిఖీలు చేపడుతున్నారు. నిరంతరం నిఘాతో అక్రమార్కుల పని పట్టేందుకు తగిన ఏర్పాట్లతో విధులు నిర్వహిస్తున్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా వచ్చేపోయే వాహనాలను తనిఖీలు చేస్తున్నారు.

'ఉపాధి'లో పారదర్శకత ఉండాలి



ఇల్లెందురూరల్: అవగాహన కల్పిస్తున్న డీఆర్‌పీ తిరుపతిరావు



టేకులపల్లి: హాజరైన మేట్లు, టీఏ, కార్యదర్శులు

పాల్వంచరూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనుల కొలతల్లో సిబ్బంది పారదర్శకత ఉండాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గ్రామ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది మేట్లతో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఈజీఎస్ పనుల్లో కూలీలు, సిబ్బంది ఏరోజు ఎంత పనిచేయాలో కొలతలను నిర్ణయించుకుని దానిని పూర్తి చేయడం ద్వారా ఎక్కువ వేతనం పొందవచ్చని పేర్కొన్నారు. మేట్లు పని ప్రదేశంలో నిర్దేశించిన కొలతలు ఎలా పెట్టుకోవాలి, మార్కింగ్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ పారండ్ల రంగా, ఈసీ పుల్లయ్య, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు పేర్కొన్నారు. డీఆర్‌డీఓ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా వ్యాప్త కార్యక్రమంలో భాగంగా టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీడీఓ అధ్యక్షతన ఉపాధి హామీ పథకం విభాగంలో పని చేస్తున్న మేట్లు, ఎఫ్ఏ, టీఏలతో పాటు 36 గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఉపాధి హామీ పథకం నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. రోజుకు రూ.272 వేతనం వచ్చే విధంగా ఎలా పని చేయాలి, ఎంత పని చేయాలి అనే వివరాలపై అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పనికి వచ్చే కూలీలందరూ తప్పనిసరిగా పనిముట్లు గడ్డపార, పార, తట్ట తదితరాలు తెచ్చుకునేలా మేట్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో జరుగుతున్న ప్రతీ ఈజీఎస్ పని వద్ద తప్పనిసరిగా ఒక టెంట్ వేయించాలని, మెడికల్ బాక్స్ ఏర్పాటు చేయించాలని కార్యదర్శులను ఆదేశించారు. పని ప్రదేశంలో పని చేస్తున్న కూలీల మస్టర్ల నిర్వహణ సరిగా చేయాలని, మస్టర్లు ఎలా వేయాలి, ఏపీ నిబంధనలు పాటించాలో తెలియజేశారు. నర్సరీలను సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా శ్రద్ధగా చూసుకోవాలని ఆదేశించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కనీసం 6 గంటలు పని చేయించాలని సూచించారు. ఒకరికి బదులు మరొకరు పనిలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఓటీఎస్‌లు వీరన్న, శంకర్, తిరుపతయ్య, ఎంపీఓ జక్కుల లక్ష్మీగణేష్ గాంధీ, ఏపీఓ కాళంగి శ్రీనివాస్, మేట్లు, ఎఫ్ఏ, టీఏ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఉపాధి హామీ కూలీలు వేసవి భత్యాన్ని సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది వారికి సహకరించాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి కూలీలకు వేసవి భత్యం, సద్వినియోగం చేసుకోవాల్సిన అంశాలపై డీఆర్‌పీలు బుధవారం ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధి కూలీలకు వేసవి భత్యంగా ఒకరోజు కూలీని రూ.272గా నిర్ణయించిందని చెప్పారు. ఈ వేతనాన్ని నూరుశాతం సద్వినియోగం చేసుకునేలా వారిలో చైతన్యం కల్పించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందికి ఉందన్నారు. సమావేశంలో ఎంపీఓ చిరంజీవి, ఏపీఓ శంకర్, డీఆర్‌పీలు తిరుపతిరావు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.